


# సమయస్ఫూర్తి

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

రంగాపురంలో రాములయ్య, శంకరయ్య అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారిద్దరూ ఒకరంటే ఒకరు ప్రాణంగా ఉండేవారు. ఒకసారి వాళ్ళిద్దరూ ఒక పని నిమిత్తం పట్నం వెళ్ళవలసి వచ్చింది. పట్నంలో పని పూర్తయ్యే సరికి చాలా సమయం అయింది. సాధారణంగా పని తొందరగా ముగిసిపోతే పట్నం నుండి వాళ్ళ ఊరికి జట్కా బండి మీద వెళ్ళేవారు. ఇప్పుడు సమయం మించిపోవడంతో తప్పని సరిగా నడుచుకుంటూ వెళ్ళాల్సిందే! ఎందుకంటే మరునటి రోజు వాళ్ళిద్దరూ ఊళ్ళో కొన్ని పనులు తప్పనిసరిగా చేయాలి. అయితే ఇక్కడో విషయం చెప్పాలి. అదేమిటంటే పట్నం నుండి వాళ్ళ ఊరికి వెళ్ళాలంటే తక్కువ దూరంగల ఓ మార్గం ఉంది. దాని

గుండా అయితే రెండు మూడు గంటల్లోవాళ్ళూరికి చేరిపోవచ్చు. కాని మధ్యలో ఒక శ్మశానం దాటవలసి ఉంటుంది. రాములయ్యకి ఎటువంటి భయాలూ ఉండవు కానీ, శంకరయ్య అలా కాదు. చాలా భయస్తుడు. ప్రతి చిన్న దానికీ బెంబేలు పడతాడు. నడనుచుకుంటూ శ్మశానం మీదుగా ఊరికెళదామంటే శంకరయ్య వినడు అందుకని రాములయ్య 'శంకరయ్యా. నేను నీకు కథ చెబుతాను. కథపూర్తయిన తర్వాత నేను అడిగే మూడు ప్రశ్నలకి గనుక నువ్వు సమాధానం చెబితే నువ్వు గెలిచినట్టు. లేదా నేను గెలుస్తాను' అన్నాడు. శంకరయ్య ఒప్పుకున్నాడు.

రాములయ్య కథ చెప్పడం మొదలెట్టాడు. ఆసక్తి కరంగా, అడుగడుగునా అనుహ్యమైన మలుపులతో కథ చెబుతూ శంకరయ్య మనసుని ఆకట్టుకున్నాడు. నెమ్మదిగా నడకసాగిస్తూ కథని రసవత్తరంగా చెబుతున్నాడు. శంకరయ్య నాగస్వరానికి లొంగిన నాగులా కథలో లీనమై రాములయ్యని అనుసరిస్తూ నడవసాగాడు.

కొంతసేపయ్యాక కథ పూర్తి చేశాడు రాములయ్య.

"కథ భలేగా వుంది రాములయ్యా,క అన్నట్టు నువ్వేదో మూడు ప్రశ్నలేస్తానని అన్నావుగా అడుగు" అన్నాడు శంకరయ్య.

"ఇప్పుడు వాటి అవసరం లేదులే శంకరయ్యా. మన ఊరోచ్చేశాం. శ్మశానం గుండా నడుచుకుంటూ మన ఊరికి రావటానికి నువ్వు భయపడతావని నేను నిన్ను కథలో లీనం చేశాను. నేననుకున్నట్టుగానే నువ్వు పరిసరాలని మర్చిపోయావు." అన్నాడు నవ్వుతూ రాములయ్య.

"నువ్వు నిజంగా నా శ్రేయోభిలాషివి. ప్రాణ మిత్రుడివి. నీ చక్కటి కథతో నాకు భయం లేకుండా చేయడమే కాదు, నడవడంలోని శ్రమ తెలియకుండా చేశావు. నిజంగా నీ సమయస్ఫూర్తికి నా అభినందనలు. ముందు ముందు నేనూ నా భయాన్ని అధిగమిస్తాను" అన్నాడు దృఢంగా శంకరయ్య.